23072024-MAI-04_Layout 1 7/23/2024 2:34 AM Page 1



# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## అపరాధిగా ఇజ్రాయెల్

'**దశాబ్దాలుగా** పాలస్తీనా భూభాగాలను ఇజ్రాయెల్ ఆక్రమించుకుని ఉండటం చట్ట విరుద్ధం.. వీలైనంత త్వరలో దీన్ని చక్కదిద్దాల్సి ఉంది' అంటూ అంతర్జాతీయ న్యాయస్థానం జూలై 19న వెలువరించిన తీర్పు చరిత్రాత్మకమైనది. 15 మంది సభ్యుల ధర్మాసనం జారీ చేసిన ఈ ఉత్తర్వుల్లో ఇజ్రాయెల్‌ను అభిశంసిస్తూ వర్ణవివక్షాపూరిత దమననీతి వంటి తీవ్రమైన పలు నేరనిర్ధారణలున్నాయి. అయితే ఇది ఐరాస అభ్యర్థన మేరకు వెలువరించిన సలహా సంప్రదింపుల్లో భాగమే తప్ప అమలుకు ఉద్దేశించింది కాదని గుర్తుంచుకోవాలి. ఓ వైపు ప్రపంచ దేశాల్లో ఏకాకి అవుతున్న ఇజ్రాయెల్ మరోవైపు ఆక్రమిత ప్రాంతా ల్లో అమానుష విధానాలను యథేచ్ఛగా అమలుచేస్తున్నది. గాజాలో నరమేధం సాగిస్తున్నది. ఇప్పటివరకు అక్కడ ఇజ్రాయెల్ జరుపుతున్న దాడుల్లో మరణాల సంఖ్య 37 వేలు దాటింది. మృతుల్లో అత్యధికులు స్త్రీలు, పిల్లలే కావడం మానవత్వానికే సిగ్గుచేటు. హమాస్ దాడికి ప్రతీకారంగా గాజాను ఇజ్రాయెల్ బూడిద చేస్తున్న ది. ఇది ఆక్రమణ కన్నా ఘోరమైన విషయం.

ఈ ఊచకోతపై దక్షిణాఫ్రికా అంతర్జాతీయ న్యాయస్థానంలో వేసిన మరో కేసు ప్రస్తుతం విచారణలో ఉన్నది. గాజాలో ఇజ్రాయెల్ జరుపుతున్న ఊచకోత యుద్ధనేరం కిందకు వస్తుందని, దీనిపై విచారించి శిక్ష విధించాలని కోరుతూ దక్షిణాఫ్రికా దాఖలు చేసిన కేసు నిజానికి అమలు చేయాల్సిన తీర్పు జారీకి ఉద్దేశించింది. ఈ కేసులో అంతర్జాతీయ న్యాయస్థానం ఈ సరికే కొన్ని కీలక ఉత్తర్వులు జారీచేసింది. దక్షిణ గాజాలోని రఫాలో నిరాశ్రయులు తలదాచుకున్నందున ఆ నగరంపై సైనిక దాడులు ఆపాలని ఇజ్రాయెల్‌ను ఆదేశించింది. కానీ, ఇజ్రాయెల్ ఏ మాత్రం ఖాతరు చేయకుండా దాడులు కొనసాగించి అంతర్జాతీయ చట్టాలు, న్యాయాలూ తనకు పట్టవని మరోసారి చాటిచెప్పింది. అయితే పశ్చిమదేశాల తిరుగులేని మద్దతు కారణంగా ఇజ్రాయెల్ నిజానికి ఇలాంటివి పెద్దగా పట్టించుకోదనేది తెలిసిందే. కాకపోతే ప్రజాభిప్రాయాన్ని పాలస్తీనాకు అనుకూలంగా సమీకరించేందుకు ఇవి తోడ్పడతాయి. గాజాలో ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న యుద్ధాన్ని అగ్రరాజ్యం అమెరికా పరోక్షంగా సమర్థిస్తున్న సంగతి తెలిసిందే. అయితే అదే అమెరికాలో యూనివర్సిటీ క్యాంపస్‌లు ఇజ్రాయెల్ వ్యతిరేక ప్రదర్శనలతో దద్దరిల్లడం గమనించవచ్చు.

తమకు నిలువ నీడలేదనీ, తమకంటూ ఓ దేశం కావాలని ఇజ్రాయెలీలు పంతం నెగ్గించుకున్నారు. పాలస్తీనాలో ఓ భూభాగాన్ని సొంతం చేసుకున్నారు. అందుకు ఐరాసను వేదికగా వాడుకున్నది. కానీ, ఇప్పుడు అదే ఇజ్రాయెల్ పాలస్తీనీయులకు నిలువ నీడ లేకుండా తరిమికొడుతున్నది. ఇప్పుడు ఐరాసనే బేఖాతరు చేస్తుండటం విచిత్రం. అంతర్జాతీయ న్యాయస్థానాన్నే తోసిరాజంటుండటం గర్హనీయం. మానవతావాదానికి తామే పరిరక్షకులమని చెప్పుకొనే పశ్చిమ దేశాలు పాలస్తీనా ప్రజలను ఆదుకునేందుకు ముందుకురావాల్సిన అవసరం ఉన్నది. అదే సమయంలో అంతర్జాతీయ సంస్థలను పటిష్ఠపరిచేందుకు పాలస్తీనా సమస్య చక్కటి అవకాశాన్ని కల్పిస్తున్నది. సంకుచిత ప్రయోజనాలను పక్కనపెట్టి దేశాలన్నీ ఒక్కతాటి మీదకు వస్తే కానీ ఇది సాధ్యపడదు.

**కేంద్రంలోని నరేంద్ర మోదీ 3.0 ప్రభుత్వం 2024-25కు సంబంధించి నేడు ప్రవేశ పెట్టనున్న పూర్తిస్థాయి బడ్జెట్ కోసం దేశం మొత్తం ఆసక్తిగా చూస్తున్నది. ఈ సారి బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులుంటాయి? పేద, మధ్య తరగతికి దక్కే ఊరట ఏమిటి? ఉద్యోగులకు ఆదాయపు పన్ను, పాత పింఛన్ విధానంపై శుభవార్తలుంటాయా? ధరలు, పన్నుల భారం తగ్గుతుందా? పారిశ్రామిక రంగాలకు ఏయే ప్రోత్సాహకాలుంటాయి? దేశ ప్రజలు ఇలా ఎన్నో ఎంతో ఆశిస్తున్న నేపథ్యంలో ఈ రోజు ప్రవేశపెట్టనున్న బడ్జెట్ కేంద్రానికి ఒక సవాలు వంటిది. దేశంలో మునుపెన్నడూ లేనివిధంగా జీఎస్టీ వసూళ్లు సుమారు లక్షకోట్లకు పైగా చేరడం, అలాగే ఆర్బీఐ నుంచి రూ.2,11,000 కోట్లు డివిడెండ్ కేంద్ర ప్రభుత్వ ఖజానాకు చేరడం వంటివి బడ్జెట్‌పై ఉన్న ఆసక్తిని మరింతగా రేపుతున్నాయి. అయితే ఈ అదనపు ఆదాయం సంక్షేమ పథకాలకు మళ్లిస్తారా? లేక 5.5 శాతం నుంచి 4.7 శాతం వరకు ద్రవ్యలోటును తగ్గిస్తారా? అనేది వేచి చూడాలి. అయితే కేంద్రం ఈసారి కొన్ని కీలక అంశాలను పరిగణనలోకి తీసుకొని బడ్జెట్‌ను రూపొందించాల్సి ఉన్నది.**

## కేంద్ర బడ్జెట్‌తో ఎవరికి మేలు?



**డాక్టర్ రామకృష్ణ బండారు**
**79057 51940**




ముఖ్యంగా, దేశంలో వినియోగదారుల వినిమయ శక్తిని మరింతగా పెంచాలి. అందుకోసం ఐటీ చెల్లింపులలో మార్పులు తీసుకురావాలి. స్లాబ్‌లలో మార్పుల కోసం దేశంలో ఐటీ చెల్లించే 9.37 కోట్ల మంది ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత పన్ను చెల్లింపునకు సంబంధించి ఉన్న రెండు విధానాలతో పన్ను పరిమితిని రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు, అలాగే రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు పెంపును ఆశిస్తున్నారు. అలాగే ఆదాయపు పన్ను స్టాండర్డ్ డిడక్షన్‌ను సుమారు లక్ష రూపాయల వరకు పెంచాలి. వాస్తవ ఖర్చులను దృష్టిలో ఉంచుకొని, సెక్షన్ 80 సీ పరిమితిని రూ.1.5 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు పెంచాల్సిన అవసరం ఉన్నది. ముఖ్యంగా గృహ రుణాలకు సంబంధించిన వడ్డీ చెల్లింపులపై సెక్షన్ 24 బీ కింద వడ్డీ మినహాయింపును రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచాలి. కారణం భూములు, ముడిసరుకుల ధరలు పెరగడమే. అలాగే సెక్షన్ 80 ఈఈఏని పునరుద్ధరించి ఆ పరిమితిని లక్ష రూపాయల వరకు పెంచాలని కోరుకుంటున్నారు. గత కొన్నేండ్లుగా కార్పొరేట్ టాక్స్ 32 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిన ప్రభుత్వం ఈసారి తమ పన్నుల భారాన్ని తగ్గించి తమ పొదుపును పెంచేవిధంగా నిర్ణయాలు తీసుకోవాలని సగటు ఉద్యోగి కోరుకుంటున్నాడు. అటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సైతం 8వ వేతన కమిషన్, పాత పింఛన్ విధానంపై ప్రకటనల కోసం ఎదురుచూస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో అమలుచేస్తున్న పథకాల కేటాయింపులను పెంచి వాటిని బలోపేతం చేయాలి. ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రోడ్ల నిర్మాణం వంటి మౌలిక వసతుల కోసం కేటాయింపులు ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణాలకు ఇచ్చే సబ్సిడీని పెంచాలి. దాంతో పాటు ప్రజారోగ్యంపైనా దృష్టిపెట్టాలి. ఆరోగ్య భద్రతపై చేస్తున్న మొత్తం వ్యయంలో కేంద్ర ప్రభుత్వ వ్యయం 1.9% కాగా మొత్తం జీడీపీలో అది 0.28%. ఆరోగ్య కుటుంబ సంక్షేమం లెక్కల ప్రకారం మొత్తం ఆరోగ్య భద్రతకు దేశ ప్రజలు చేస్తున్న వ్యయంలో సుమారు 47 శాతం స్వయంగా తమ ఆదాయం నుంచి భరిస్తున్నారు. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకం కింద ప్రస్తుతం సుమారు 12 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల వరకున్న ఆరోగ్య బీమాను 10 లక్షలకు పెంచాలి. అలాగే, గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన పెరిగేలా కొన్ని పథకాలను రూపకల్పన చేయాలి.

ఇకపోతే నిరుద్యోగం, ద్రవ్యోల్బణాన్ని తగ్గించే నిర్ణయాలు ఈ బడ్జెట్‌లో కీలకమైనవి. సీఎంఐ తాజా నివేదిక ప్రకారం దేశంలో నిరుద్యోగిత రేటు 9.2 శాతం. భద్రత, మంచి వేతనం కల్పించే తయారీ, సేవారంగానికి సంబంధించిన పెట్టుబడులను ఆకర్షించేలా నిర్ణయాలుండాలి. అటు ద్రవ్యోల్బణం విషయానికి వస్తే ప్రభుత్వ అంచనాల ప్రకారం టోకు ధరల ద్రవ్యోల్బణం సుమారు 3.4 శాతం, వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం 5.1 శాతం, ఆహార ద్రవ్యోల్బణం 9.4 శాతానికి పెరిగాయి. వీటిని కట్టడి చేసే నిర్ణయాలు అవసరం. అలాగే విద్యారంగంలో ముఖ్యంగా ప్రాథమిక విద్యారంగం బలోపేతం చేసేందుకు కీలక నిర్ణయాలుండాలి.

మౌలిక సదుపాయాలు డిజిటల్ విద్య, విద్యారుణాల సబ్సిడీపై నిర్ణయాలు ఆశిస్తున్నారు. ఇక తయారీ రంగంపై కూడా బడ్జెట్‌లో కీలకమైన అంశాలుండాలి. ముఖ్యంగా, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్, ఇతర హరిత సాంకేతికతలలో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు టాక్స్ సబ్సిడీలు కల్పించాలి. టెక్నాలజీకి నరేంద్ర మోదీ సర్కార్ తొలి నుంచీ పెద్దపీట వేస్తున్నది. దీనికి తగ్గట్టు ఆటోమొబైల్ రంగంలో సంస్కరణలకు గత బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ వాహనాలకు మన దేశంలో డిమాండ్ పెరుగుతున్నది. అందుకే గత బడ్జెట్‌లో 'ఫేమ్' పథకం ప్రవేశపెట్టారు. హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వాహనాలకు టాక్స్ తగ్గించడంతో పాటు, వీలైనన్ని రీచార్జి సెంటర్లను నెలకొల్పేవిధంగా నిర్ణయాలుండాలి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఊతం ఇచ్చేలాగా బడ్జెట్ ఉండాలని ఆయా రంగ నిపుణులు సైతం కోరుకుంటున్నారు. కరోనా మహమ్మారి అనంతరం ఈ రంగం ఇప్పుడిప్పుడే లాభాల బాట పడుతున్నది. అలాగే, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులలో పెట్టుబడులు ఆకర్షించే విధంగా బడ్జెట్ ఉండాలి. ఇక ఇన్సూరెన్స్ రంగంలో కొన్ని సంస్కరణలు తేవడం ద్వారా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా లైఫ్ ఇన్సూరెన్స్ వ్యాపారం చేసుకునే అవకాశం కలుగుతుంది. కంపోజిట్ లైసెన్స్, మూలధన నిబంధనలను మార్చేవిధంగా నిర్ణయాలు ఉండాలి. అటు రియల్ ఎస్టేట్ రంగం కూడా ఈ బడ్జెట్‌పై భారీగానే ఆశలు పెట్టుకున్నది. క్రెడిట్ ఆధారిత రాయితీ పథకం తిరిగి పునరుద్ధరించాలని కోరుతున్నదీ రంగం. ఇక అందుబాటులోని ఇళ్లపై ఉన్న పరిమితిని రూ.75 లక్షలకు పెంచి జీఎస్టీని 1 శాతానికి పరిమితం చేయాలని కోరుకుంటున్నారు.

రైతులు, రైతు సంఘాలు సైతం వ్యవసాయరంగానికి ఈసారి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని కోరుతున్నారు. రైతుల ఆదాయం పెంచేవిధంగా, వ్యవసాయ పరిశోధనలు, ఎరువుల రాయితీలు మౌలిక సదుపాయాల అభివృద్ధి వాటిపై నిధులు పెంచాలని రైతులు ఆశిస్తున్నారు. మూలధన పెట్టుబడుల కోసం గత మధ్యంతర బడ్జెట్‌లో రూ.11.11 లక్షల కోట్లు కేటాయిస్తే ఈ బడ్జెట్‌లో అది మరింతగా పెరిగే అవకాశం ఉన్నది. ఇటు రక్షణ రంగంలో ఆధునికీకరణ, గ్రామీణాభివృద్ధి వంటి వాటికి కూడా కేటాయింపులు పెరగవచ్చు. బీజేపీ గత ఎన్నికల్లో వయోవృద్ధులకు ఉచిత ఆరోగ్య బీమా పథకం, పైపుల ద్వారా వంట గ్యాస్ కనెక్షన్లు అలాగే, వచ్చే ఐదేండ్ల పాటు ఉచిత రేషన్ వంటి హామీలకు నిధులు కేటాయిస్తూనే, సంస్కరణలకు పెద్దపీట వేయవచ్చు. ద్రవ్యోల్బణం కట్టడి, అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతూకం, వృద్ధికి ఊతమివ్వడం వంటి అంశాలకు ప్రాధాన్యతను ఇవ్వాలి.

> **రైతుల ఆదాయం పెంచేవిధంగా, వ్యవసాయ పరిశోధనలు, ఎరువుల రాయితీలు మౌలిక సదుపాయాల అభివృద్ధి వాటిపై నిధులు పెంచాలని రైతులు ఆశిస్తున్నారు. మూలధన పెట్టుబడుల కోసం గత మధ్యంతర బడ్జెట్‌లో రూ.11.11 లక్షల కోట్లు కేటాయిస్తే ఈ బడ్జెట్‌లో అది మరింతగా పెరిగే అవకాశం ఉన్నది... ద్రవ్యోల్బణం కట్టడి, అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతూకం, వృద్ధికి ఊతమివ్వడం వంటి అంశాలకు ప్రాధాన్యాన్ని ఇవ్వాలి.**

**(వ్యాసకర్త: అసిస్టెంట్ ప్రొఫెసర్-కామర్స్ విభాగం, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ)**

## వీల్‌చైర్ పన్ను విధించడం వివక్షే!

*మీరు వాకింగ్‌కు వెళ్లిన ప్రతీసారి, డాక్యుమెంట్‌ను ప్రింట్ తీయించుకున్న ప్రతీసారి లేదా సాదాసీదాగా చెప్పాలంటే.. మీ శరీరాంగాలు సజావుగా కలిగి ఉన్నందుకు మీపై పన్ను విధిస్తే మీకు ఎలా ఉంటుందో ఒకసారి ఊహించుకోండి. లక్షలాది మంది వికలాంగ భారతీయులు నిత్యం ఎదుర్కొంటున్న స్పష్టమైన అన్యాయం ఇది. అన్యాయంగా, అసంబద్ధంగా అనిపించినప్పటికీ జీఎస్టీ వల్ల జరుగుతున్న దుష్పరిణామమిది. 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఏడేండ్లుగా కృత్రిమ అవయవాలు, బ్రెయిలర్లు, వీల్‌చెయిర్లు కలిగిన వికలాంగులు తమకు సాయమందిస్తున్న పరికరాలపై అదనంగా 5 శాతం పన్ను చెల్లిస్తున్నారు.*



**జై అనంత్ దేహద్రాయ్**

దేశంలోని పన్ను విధాన రూపకర్తలు ఇలాంటి పాలసీని రూపొందించారు. ఇది వికలాంగుల పట్ల వివక్ష చూపడమే కాకుండా, వారిపై జరిమానా విధించడం కూడా. వికలాంగుల పట్ల ప్రధాని మోదీకి ఉన్న శ్రద్ధను చూసి ఆశ్చర్యం కలుగుతున్నది. వికలాంగులను 'దివ్యాంగ్' అని పిలుస్తారు. దివ్యాంగ్ అంటే హిందీలో దైవ అంశ అని అర్థం. నడక, నేర్చుకోవడంపై ప్రభావం చూపుతున్న ఈ విధానం ఆర్టికల్ 14 ప్రకారం.. రాజ్యాంగం ముందు చెల్లుబాటు కాదు. ఎలాంటి సంక్లిష్టమైన, చట్టపరమైన సూత్రాలను తెలుసుకోకుండానే సామాన్యుడు సైతం ఈ విధానం వెనకున్న అన్యాయం ఏమిటో అర్థం చేసుకోగలడు.

రూ.లక్ష విలువ చేసే వీల్‌చైర్‌పై ఐదు శాతం పన్ను చెల్లిస్తున్న వ్యవహారాన్ని తీసుకుందాం. ఒకవేళ వీల్‌చైర్ జీవితకాలం 500 కిలోమీటర్లు అనుకుందాం. అంటే.. సదరు దివ్యాంగుడు ఒక్కో కిలోమీటర్‌పై రూ.10 పన్ను చెల్లించాల్సి వస్తున్నది. అలాగే బ్రెయిలీ పబ్లిషర్ వాడే అంధుడు దానిపై పన్ను చెల్లించక తప్పదు. సదరు వ్యక్తి అంధుడు అయినందుకు అతనిపై విధిస్తున్న అదనపు లెవీ ఇది. దివ్యాంగులు నడిచేందుకు, జ్ఞానాన్ని పొందేందుకు వినియోగించే ఇలాంటి పరికరాలపై పన్ను విధించడం స్పష్టమైన వివక్షే.

ప్రభుత్వాలు విధించే పన్నుల రాజ్యాంగ బద్ధతను సుప్రీంకోర్టు పరీక్షించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. సకాళ్ పేపర్స్ (1961), ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (1984), ఆశీర్వాద్ ఫిల్మ్స్ (2007) కేసులు ఈ కోవకు చెందినవే. ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే ఎలాంటి పన్ను, సెస్సు లేదా డ్యూటీలకైనా మన న్యాయమూర్తులు అడ్డుకట్ట వేయగలరు. సకాళ్ పేపర్స్ కేసునే తీసుకుంటే.. ప్రకటనలపై ప్రభుత్వం విధించిన ఆంక్షలను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రకటనలపై ఆంక్షల వల్ల పత్రిక సర్క్యులేషన్ తగ్గిపోతుందని, దానివల్ల ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం.. పౌరుల ప్రాథమిక హక్కు అయిన వాక్ స్వాతంత్ర్యంపై ప్రభావం పడుతుందని సర్వోన్నత న్యాయస్థానం ఈ కేసు విచారణ సందర్భంగా పేర్కొంది. అదేవిధంగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కేసులో న్యూస్ ప్రింట్‌పై విధించిన కస్టమ్స్ డ్యూటీని కొట్టివేసింది. 2007లో ఏపీ ప్రభుత్వం తెలుగేతర సినిమాపై విధించిన లెవీని సుప్రీంకోర్టు రద్దు చేసింది. తెలుగేతర సినిమాపై పన్ను విధించడాన్ని సామాజిక విభజనగా న్యాయస్థానం అభివర్ణించింది.



దివ్యాంగులు వినియోగించే పరికరాలపై విధించిన పన్ను అందుకు భిన్నమైనదేమీ కాదు. ఈ పన్ను దివ్యాంగులకు వ్యతిరేకంగా మూస పద్ధతులను కొనసాగించే ప్రభావాన్ని కలిగి ఉంది. వారి ప్రాథమిక విధులైన నడవడం, చదవడంపై పన్ను విధించడమంటే స్పష్టంగా వారి వైకల్యంపై జరిమానా విధించడమే. 2024లో ఇలాంటి పన్ను పుస్తకాల్లో ఉండకూడదు. జన్మస్థలం (ప్లేస్ ఆఫ్ బర్త్) ఆధారంగా వివక్షను నిరోధించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 ముందు పరీక్షకు ఇది నిలవదు. ఈ ఆర్టికల్‌లోని 'ప్లేస్ ఆఫ్ బర్త్' అనే నిబంధనకు సమగ్రమైన వివరణ ఇవ్వాలి. అంతేకాదు, దివ్యాంగులను అందులో చేర్చాలి. ఈ పన్నును కచ్చితంగా రద్దు చేయాలి. వాస్తవానికి 2016లో దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఓ చట్టాన్ని తీసుకొచ్చింది. అందులోని సెక్షన్ 3 దివ్యాంగుల పట్ల వివక్షను నిషేధిస్తుంది. 2021లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ లెఫ్టినెంట్ కల్నల్ నితీషాకు సంబంధించిన కేసు విషయంలో వివక్షపై కీలక తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా సమానత్వ భావనకు పరోక్ష వివక్షను గుర్తించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

దివ్యాంగుల పరికరాలపై వసూలు చేస్తున్న జీఎస్టీ చాలా తక్కువ మొత్తంలో ఉన్నప్పటికీ ఇది వారి ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం. వారి ప్రాథమిక హక్కులైన నడక, చదవడంపై పన్ను విధించడం ద్వారా వారికి సాధికారతపై కాకుండా, ఆత్మన్యూనతపై సందేశం ఇచ్చినట్టు అవుతుంది.

**('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)**

## కొత్త చట్టాలపై మీ వైఖరేంటి?

*దేశంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త న్యాయ చట్టాలపై వివిధ వర్గాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చట్టాల్లో ఉన్న పలు నిబంధనలు, సెక్షన్లు ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా, వ్యక్తి స్వేచ్ఛను హరించేలా ఉన్నాయి. నూతన చట్టాల్లో పేర్కొన్న అనేక సెక్షన్ల వల్ల రాష్ట్రంలో పోలీస్ రాజ్యాన్ని తీసుకువచ్చే ప్రమాదం ఉన్నదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ నేపథ్యంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి ఒక బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖ యథాతథంగా..*



తెలంగాణ అంటేనే పోరాటాల గడ్డ, ఉద్యమాలకు అడ్డా. పౌరహక్కుల పరిరక్షణ కోసం ఎంతటి త్యాగాలకైనా సిద్ధపడే స్వభావం ఉన్న నేల ఇది. ప్రజాస్వామ్య హక్కుల కోసం ఉక్కు పిడికిళ్లు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి. అలాంటి తెలంగాణ రాష్ట్రంలోనూ ఇటీవల కేంద్రం తెచ్చిన చట్టాలతో అలజడి రేగుతున్నది. దేశంలో అమల్లోకి వచ్చిన నూతన న్యాయచట్టాలపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటివరకు అమల్లో ఉన్న పాత చట్టాల స్థానాల్లో కేంద్రం తీసుకొచ్చిన కొత్త నేర చట్టాలు జూలై 1 సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఏఏ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ) అమల్లోకి వచ్చాయి. అయితే, పలు వర్గాల నుంచి నూతన చట్టాలపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ చట్టాల్లో ఉన్న పలు నిబంధనలు, సెక్షన్లు ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా, వ్యక్తి స్వేచ్ఛను హరించేలా ఉన్నాయని హక్కుల సంఘాల ప్రజా మేధావులు అభిప్రాయపడుతున్నారు! న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నిరసనలు.. ఉద్యమాలు చేసే ప్రజలకు ప్రతికూలంగా కొత్త చట్టాలు ఉన్నాయని.. పోలీసులకు, ప్రభుత్వానికి మితిమీరిన అధికారాన్ని కట్టబెడుతున్నాయని సామాజిక ఉద్యమకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు! ప్రజా స్వామికవాదులు, న్యాయ నిపుణులు మాత్రమే కాదు, పలు రాష్ట్రాలు సైతం ఈ నూతన చట్టాలను వ్యతిరేకిస్తున్నాయి!. పశ్చిమబెంగాల్, తమిళనాడు, కర్ణాటక ముఖ్యమంత్రులు ఈ చట్టాల అమలును వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించారు! కానీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, ఇక్కడి కాంగ్రెస్ పార్టీ తన వైఖరి ఏమిటో స్పష్టంగా చెప్పలేదు! రేవంత్ రెడ్డి ఈ అంశంలో తన వైఖరిని స్పష్టం చేయాలి!.

> **న్యాయకోవిదులు.. అనుభవజ్ఞులైన క్రిమినల్ లాయర్లు, దర్యాప్తుసంస్థలు, న్యాయమూర్తులు, సాధారణ పౌరులతో విస్తృత స్థాయిలో సంప్రదించి వారి అభిప్రాయాలను సేకరించకుండానే ఈ చట్టాలను తొందరపాటుతో తీసుకువచ్చారు. లోక్ సభ, రాజ్యసభ నుంచి ఏకంగా 146 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేసి, ఎలాంటి చర్చ లేకుండా ఆమోదించిన చట్టాల అమలు నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఇప్పటికే పలు పిటిషన్లు దాఖలయ్యాయి. మా పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ ఈ చట్టాల అమలు నిలిపివేయాలని సుప్రీం కోర్టులో కేసు వేశారు.**

ఈ చట్టాల్లో ఉన్న పలు నిబంధనలు, సెక్షన్లు అత్యంత దారుణంగా ప్రజల హక్కులను, స్వేచ్ఛను హరించేలా ఉన్నాయి. ఈ చట్టాల ప్రకారం నిందితులకు బెయిలిచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గిపోతాయి, పోలీసులకు, ప్రభుత్వానికి విపరీతమైన అధికారాలు సంక్రమిస్తాయి. ఇందులో పౌరుల హక్కులకు హాని కలిగించే కొన్ని ముఖ్యమైన అంశాలను ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

ఈ చట్టాల ప్రకారం ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేయడం నేరం. ఇది అత్యంత దురదృష్టకరం. ఈ చట్టం ప్రజల హక్కుల కోసం పోరాటం చేసే పౌరులకు ప్రమాదకారిగా మారుతుంది. గతంలో ఉన్న 15 రోజుల పోలీసు కస్టడీ ఇప్పుడు 90 రోజులకు పెరిగింది. ఈ గడువును ఉపయోగించుకొని ఎన్నిసార్లయినా కస్టడీలోకి తీసుకునే అవకాశం కల్పిస్తుంది. ఈ కస్టడీని ఒకే దఫాలో కానీ, పలు దఫాల్లో కానీ అమలుపరచవచ్చు. తద్వారా నిందితుడికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసినా పోలీసులు కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉంటుంది. క్రిమినల్ కేసులో ఉన్న నిందితుల ఆస్తులను జప్తు చేయడానికి కోర్టు అనుమతి అవసరం ఉండేది. అయితే, కొత్త చట్టంలో పోలీసులకు పూర్తి అనుమతి లభించింది.

> **వ్యవస్థీకృత నేరాలకు వ్యక్తులను ప్రాసిక్యూట్ చేయడానికి దర్యాప్తు సంస్థలకు ఏకపక్ష, విచక్షణ అధికారాలను కొత్త చట్టం అనుమతిస్తుంది. జాతీయ భావాలను ప్రభావితం చేసే నేరాలకు మూడేండ్ల జైలుశిక్ష, జరిమానా. సైబర్ నేరాలు, హ్యాకింగ్, ఆర్థిక నేరాలు, గోప్యత, సాంకేతికత ద్వారా విధ్వంసం వంటి వాటి కోసం రూపొందించిన ప్రత్యేక అధ్యాయంలో అనేక అస్పష్టతలున్నాయి. కొత్త చట్టాల అమలుకు ముందు (జూలై 1, 2024కి ముందు) జరిగిన నేరాలను ఐపీసీ తదితర పాత చట్టాల ప్రకారం విచారించాల్సి ఉంటుంది. తర్వాత నమోదయ్యే కేసులను నూతన చట్టాల ప్రకారం విచారణ చేయాల్సి వస్తుంది. ఇది అందరినీ అయోమయంలోకి నెడుతున్నది.**

'స్వాతంత్ర్యోద్యమంలో నాటి జాతీయ నాయకులను జైళ్లలో పెట్టడానికి బ్రిటిష్ ప్రభుత్వం ఉపయోగించిన 'రాజద్రోహ' చట్టం అమలును సుప్రీంకోర్టు 2022లో నిలిపివేసింది. ఈ చట్టంపై సమీక్ష జరుపుతామని సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది. కానీ, కొత్త చట్టంలో తిరిగి 'రాజద్రోహం' చట్టాన్ని 'దేశద్రోహం' పేరుతో తీసుకువచ్చింది. ప్రభుత్వ విధానాలను విమర్శించడానికి ప్రజలకున్న హక్కును కాలరాసేందుకే ఈ చట్టం ఉపయోగపడుతున్నదన్న విమర్శలున్నాయి. నూతన చట్టాలపై విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో వీటిపైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, ఇక్కడి కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని వెల్లడించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల మాదిరి రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంలో తన వైఖరిని స్పష్టం చేయాలి. ప్రజా ఉద్యమాలకు దశాబ్దాలుగా కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న తెలంగాణ గడ్డపై నిరంకుశ నియంతృత్వ నూతన క్రిమినల్ చట్టాలను ఇక్కడ యథాతథంగా అమలు చేయడమే రాష్ట్ర సర్కారు లక్ష్యమా? లేక ఇతర రాష్ట్రాల మాదిరిగా సవరణలు తీసుకొస్తారా?అనే విషయాన్ని ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టం చేయాలి.

> **నూతన చట్టాల్లో పేర్కొన్న అనేక సెక్షన్ల వల్ల రాష్ట్రంలో పోలీసు రాజ్యాన్ని తీసుకువచ్చే ప్రమాదం ఉన్నది. గత ఏడు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేస్తున్న విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు, సోషల్‌మీడియా కార్యకర్తలను ఎక్కడికక్కడ అణచివేసేందుకు పోలీసులను విస్తృతంగా వినియోగిస్తున్నది. నూతన చట్టాల నేపథ్యంలో ఈ పరిణామాలు రాష్ట్రంలో మరింత దుర్మార్గమైన వాతావరణాన్ని సృష్టించే ప్రమాదం పొంచి ఉన్నది.**

> **జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఈ ప్రమాదకర కొత్త చట్టాలపై తన వ్యతిరేకతను ఇప్పటికే తెలియజేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ అంశంలో ఇప్పటిదాకా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. రేవంత్ సర్కారు వెంటనే తన నిర్ణయాన్ని ప్రకటించాలి. నూతన చట్టాల్లో ఉన్న నియంతృత్వపూరిత సెక్షన్లను సవరించాలని కేంద్రానికి లేఖ రాయాలి.**

ప్రజా పాలన అంటూ చెప్పుకొని ప్రభుత్వంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ నూతన చట్టాలపై తన వైఖరిని తెలియజేయాల్సిన అవసరం ఉన్నది. జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఈ ప్రమాదకర చట్టాలపై తన వ్యతిరేకతను ఇప్పటికే తెలియజేసింది. అయితే ఈ అంశంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇప్పటిదాకా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఈ అంశంలో ఇప్పటికైనా రేవంత్ సర్కారు వెంటనే తన నిర్ణయాన్ని ప్రకటించాలి. నూతన చట్టాల్లో ఉన్న నియంతృత్వపూరిత సెక్షన్లను సవరించాలని కేంద్ర ప్రభుత్వానికి వెంటనే లేఖ రాయాలి. దీంతో పాటు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రం తరపున ఒక తీర్మానాన్ని కేంద్రానికి పంపించాలని డిమాండ్ చేస్తున్నాను. ప్రజలను, పౌరులను అణచివేసే చట్టాలపైన, అందులోని సెక్షన్లపై రాష్ట్ర చట్టపరమైన పరిధి మేరకు ఒక కమిటీని వెంటనే నియమించి ఈ చట్టాల మీద తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలి. లేకుంటే ఈ ప్రభుత్వాన్ని ప్రజలు నిరంకుశ ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా పరిగణిస్తారని గుర్తుంచుకోవాలని తెలియజేస్తున్నాను.

**- కల్వకుంట్ల తారకరామారావు**
**(మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్)**